దయ్యం

"ఘనమూర్తి"

"ఫో, ముండా, ఫో! ఇంక నాకంటికి కనబడ్డావంటేచూడు నిన్ను ఏంచేస్తానో, మొహాన ఇంత పేడరాసి మరీపంపిస్తా. ఒరేవు! మాధవా! ఇలారా, చూడరా యీ ముండ నన్ను ఎలాగున అల్లరిపెడుతూందో" అంటూ వంట ఇంటిలోనుడి కేకలు పెడుతూంది గోపమ్మ.

గదిలో పేపరు చూస్తూఉన్న మాధవశాస్త్రి కేక వినబడగానే గాబరాగావచ్చి "ఏమిటమ్మా ఆ కేకలు, ఎవరు వచ్చేరు ఏమిటి" అని అడిగేడు. "ఎవరంటావేమిటిరా? అదే నీ పెళ్ళాం కాంతమ్మ." "అత్తా సాయం వస్తారూ" అంట్లూ నా చేయిపట్టుకొని లాగుతుందిరా అంది" గోపమ్మ.

"అదేమిటమ్మా అలాగంటావు. అది చనిపోయి మూడునెలలైంది అది ఎలాగు రమ్మంటుందే, ఆ మహాసాధ్వి చచ్చి ఏ స్వర్గాన ఉందో దాన్ని తిట్టకే పాపం కూడానూ" అని ఒక్క నిట్టూర్పు విడచేడు.

"నీ తెలివి ఏడిసినట్టేఉంది, చచ్చిన ముండ చావక నన్ను పీక్కొని తింటూంది" అంది గోపమ్మ.

"కానిస్తూ, వేగంగా పనిచేసుకొని గదిలో కొచ్చేయి" అంటూ వెళ్లిపోయేడు శాస్త్రి. కాంతమ్మ గర్భంతో చనిపోయింది. ఆమె బ్రతికినన్నాళ్లు హాయిగా కాలక్షేపంచేసి చనిపోయింది. అంతమందిలో మంచి అనిపించుకొని పసుపు కుంకుమతో లేచిపోయింది. గోపమ్మ కాంతమ్మను బ్రతికినన్నాళ్లు కాల్చుకొని తినేది. అందుచేతనే దయ్యంఅయి పీక్కొని తింటూంది.

గోపమ్మ అంటూ ఎంగిళ్లు ముగించుకొని గదిలోనికొచ్చి చాపగుడ్డపరచుకొని దానిమీద కూర్చుంది. "ఒరే! మాధవా! దీనికేదేనా పని చేయాలి, లేకుంటే నన్ను చంపేస్తుంది."

"ఊరుకో అమ్మా! దయ్యం ఏమిటి, నీ భయంగాని, అదేంచేస్తుంది. అసలు దయ్యమంటూ ఉందాయని నా అనుమానం" అన్నాడుశాస్త్రి.

"బాగుండ్రా? లేకపోవడం ఏమిటి, దెయ్యం ఎలాగు ఉంటుందో చెప్ప మన్నావా. వికృతంగా ముఖం, చింపిరి జుత్తు, పాదాలు వెనక్కి తిరిగి ఉంటాయి, పెద్దగోళ్లు, పారపళ్ళు, దాన్ని చూస్తేనే భయం వేస్తుంది. దయ్యాలలో అనేక రకాలు ఉన్నాయిలే. మనపెరట్లో చింత చెట్టుమీద కామినీ దయ్యముంది. అది మనశారదకూతురు. పెళ్లి కాకుండా 18 సం|| చనిపోయింది. అది కామినీ భూతం అయింది. రాత్రివేళ బావా వస్తావా ఆడు కుందాం. బావా! వస్తావా ఆడుకుందాం అంటుంది. పడుచుమగాళ్లపై బడి అల్లరి చేస్తుంది. అది ఎంత చక్కగా ముస్తాబై కనపడతుందనుకున్నావు. అదీ వాలుజడ, మల్లెచెండు చూడు చూడనిపిస్తుంది. మన ఏటివడ్డునఉన్న దిబ్బమఱ్ఱిమీద నిప్పు దయ్యంఉంది. ఎప్పుడూ నిప్పులురాలుస్తూ ఉంటుంది. దడుసుకున్నారంటె వెంటనే వాంతులు, విరోచనాలు పట్టుకొని చస్తారు. కొన్ని దయ్యాలు మనుష్యులతో కాపురం చేస్తాయి. పేరమ్మకోడలు దయ్యమై, రామిగాడితో కాపురంచేయలేదు. చక్కని పిల్లల్నికని ఎక్కడికోపోయింది. కొన్ని దయ్యాలు మనుష్యులనే ఎత్తుకొని పోతాయి. మీ తాతని రాత్రికి రాత్రి ఎత్తుకొనిపోయి ఏటిపడ్డున పడేశాయి. వెంకటరత్నాన్ని మంచంతో ఎత్తుకొనిపోయి వారధికానాలో పండుకోపెట్టేయి. తురక దయ్యం మాచెడ్డది. అది పడితే ఒక అంతటికీవదలదు. దానికి దెబ్బలేమందు" అంది గోపమ్మ.

"ఛాల్లెద్దు ఊరుకోవే! వెధవ దయ్యాలు గొడవ" అంటూ శాస్త్రి పండుకున్నాడు.

గోపమ్మ చాపమీద పంచ తలక్రింద పెట్టుకొని "మనోజవం మారుతతుల్య వేగం" అంటూ శ్లోకం చదివి పండు కుంది.

మాధవశాస్త్రి ధైర్యమైన మాటలు చెప్పేడేగాని లోపల మాత్రం చిమకు, చిమకులాడుతోంది. తన స్నేహితుడి భార్యకిలాగే ఒక దయ్యంపట్టి నానాగడ్డి తినిపిస్తోంది. ఏటివడ్డున దయ్యాలు ఉండడం నిజమేకాబోలు. ఆ మఱ్ఱి దగ్గర నిప్పు రాల్చడం నిజమే, అక్కడక్కడ నిప్పుకన బడడం నిజమే, నేను ఎవరో చుట్టకాలుస్తు న్నారు అనుకొనేవాడిని. తెల్లార గట్ట దొడ్డికిపోతే ఉస్సు, రస్సుమంటూ కేకలు వినిపిస్తాయి.

నిజంగా దయ్యాలే కాబోలు బట్టలు ఉతుకుతాయి. యీలాగు తలపోస్తూ కూర్చున్నాడు. అప్పటికి ఒంటిగంట అయింది. మాధవశాస్త్రికి నిద్రపట్టలేదు. దెయ్యాలను కంటికి కట్టినట్లు కనబడు తున్నాయి. కిటికీ తలుపులు మూసేసేడు. ఇంతలో పెరటితలుపు ఎవరో కొడు

తున్నారు. . వంట ఇంటిలో పెద్దచప్పుడు. అన్నికలసి శాస్త్రిని కంగారు పెట్టేశాయి. క్రిందను పండుకున్న తల్లిని లేవేడు గజ గజా వణకిపోతున్నాడు.

గోపమ్మలేచి "ఏంరా! నాయనా! ఏమిటి ఆలాగున్నావు" అని అడిగింది.

"శాస్త్రి గాద్గదికంగా దయ్యమే వంట ఇంటిలో అల్లరిపెడుతూంది, పెరటితలుపు గుద్దుతోంది" అన్నాడు.

"ఫరవాలేదు అదే వెళుతుంది ఈశ్వర ధ్యానంచేసి పండుకో" అంది.

మాధవశాస్త్రి ఈశ్వర ధ్యానంచేసి పండుకున్నాడు.

మాధవశాస్త్రికి ఆఫీసులేదు, ఆనాడాది వారం చాల తీరకగాఉంది, ఉదయాన్నే స్నానంచేసి కాఫీ త్రాగి "డెవల్ హౌస్" అనే నవల చదువుతున్నాడు. మంచి రస వత్తర ఘట్టంలో "వదినా, వదినా" అంటూ ప్రక్కఇంటి రంగమ్మ ఇంట్లోకి వచ్చింది.

మాధవశాస్త్రి పుస్తకంమడచి టేబిల్ మీాదఉంచి "ఏమత్తా యీ లా గొచ్చావు అమ్మ ఏటికెళ్లింది వస్తుంది ఉండు" అన్నాడు.

"ఒరే! శాస్త్రి మాపద్మ యీ వేళ రాత్రి బండిలో మదరాసునుండి వస్తూంది, మీామామగారు పొలంపనిమీాద గ్రామాంతరం వెళ్ళేరు, రేపుగాని తిరిగిరారు. నీవు స్టేషన్‌కివెళ్లి పద్మను తీసుకొనిరావాలి" అంది రంగమ్మ.

"ఓ తప్పకుండా రాత్రివెళ్లి తీసుకొని వస్తా" అన్నాడు శాస్త్రి.

ఇంతలో గోపమ్మ బిందెనీళ్లు ఇంట్లో పడేసి "ఏం వదినా ఇలాగొచ్చేవు" అంది.

'హాం! ఏమీాలేదు రాత్రిబండిలో పద్మ వస్తుంది. మీా అన్నగారు గ్రామాంతరం వెళ్ళేరు, మాధవశాస్త్రిని స్టేషనుకి వెళ్లి పద్మను తీసుకొని రమ్మన్నాను" అంది.

"ఆ మాత్రం దానికే, తప్పక వెళ్తాడు. ఒరే మాధవా వెళతావుకదూ" అని అడిగింది.

"వెళతానమ్మా" అన్నాడు శాస్త్రి.

"వెళ్లివస్తానమ్మా ఇంకా వండుకోవాలి" అంది రంగమ్మ.

"వెళుదువుగానిలే, అన్నగారులేరుగా కాస్సేపు కూర్చో" అంటూ పీటవేసింది.

రంగమ్మ పీటమీాద కూర్చుంది, గోపమ్మ కాఫీపెట్టి రంగమ్మ కింత ఇచ్చి తాను ఇంత త్రాగింది.

"వదినా చూాచేవా కాంతమ్మ దయ్యం అయి నన్ను పేపుకొని తింటూంది దానికి నేను ఏంచేసేనే" అంది గోపమ్మ.

"ఊరుకో వదినా నీ పిచ్చిగాని దెయ్యం లేదూ, దేవతా లేదు ఊరుకో" అంది రంగమ్మ.

"పోనీగాని దానిసంగతి కేంగాని నీవు పద్మను మా శాస్త్రిగాడికిచ్చేయికూడదూ. ఇద్దరూ చిలకా గోరువంకల్లాగ ఉంటారు. ఇద్దరూ చదువుకున్న వాళ్లు" అంది గోపమ్మ.

"నేనేం కాదన్నానా మీ అన్నగారిని అడుగు తథాస్తు అనవచ్చు" అంది రంగమ్మ.

"సరే వస్తుందిగా దానినే అడిగేస్తాను" అంది గోపమ్మ.

రంగమ్మ లేచి "వస్తావొదినా ఇంకా వండుకోవాలి. ఓరే శాస్త్రీ మరచిపోకు" అంటూ వెళ్లిపోయింది.

రాత్రి 8 గంటలైంది మాధవశాస్త్రి మంచంమీద పడుకొన్నాడు. గోపమ్మ అంటూ ఎంగిల్లు చేస్తోంది. మళ్ళా గోపమ్మ తిడుతోంది కోడలు కాంతమ్మని. శాస్త్రి మెల్లగా లేచి "అమ్మా! ఎందుకే తిడు తావు రేపు ఏదేనా చేయిద్దాం. వేగం గదిలో కొచ్చేయి" అంటూ వెళ్లిపోయేడు.

గోపమ్మ గదిలో చాపవేసుకొని "ఒరే! మాధవా మనపెరటి చెట్టుమీదవున్న కామినీ భూతానికి నీ పెళ్ళాం కాంతమ్మని భేతాళరాజుచేత భూస్థాపితం చేయించాలి" అంటూ పడుకొంది.

రాత్రి పదిగంటలైంది ఆకాశం మేఘావృతంగావుంది. మాధవశాస్త్రి ఒక్కడు పోవడానికి భయం, ఎవరూ సాయంలేరు. ఇంతలో వర్షం ప్రారంభమైంది, ఆలాగు ఆలోచిస్తూ మంచమీద నిద్రపోయేడు. గోపమ్మ గురకలుకొడుతూ చాపమీద పడుకొంది. గదిలో బెడ్‌లైటు వెలుగుతూంది. ఇంతలో "అత్తా! అత్తా" అంటూ పిలుస్తూంది పద్మ.

గోపమ్మ లేచి నాలుగువైపులా చూచి పడుకుంది. మళ్ళా పిలుపువినిపించింది. గోపమ్మకి పట్టరానికోపం వచ్చింది "ఒసే! ముండా పెరటిలోంచిపోయి వీధిపట్టేవు. ఏమిసాహసమే, ఉండు చస్తే చచ్చేను నిన్ను పట్టుకొని గదిలో పెట్టి నిసిగ కొయ్యక పోతే నేను గోపమ్మనుకాను' అంటూ గబగబా వీధితాళంతీసి తలుపు తీసింది. గుడ్డి వెన్నెలలో పద్మ నిలబడింది. గోపమ్మ కామినీ భూతం అనుకొని పద్మకొప్పు పట్టుకొని బరబరా యీడ్చి ఎంత చెప్పినా వినక కొట్టులోపడేసి తాళంవేసింది.

"చావుముండా చావు. యీ రోజుతో నీ పీడ వదులుతూంది, వాడిని లేపి ఇప్పుడే నీసిగ కోసేస్తా" అంటూ గదిలోకి వెళ్లింది.

మాధవశాస్త్రి మైమరచి పడుకున్నాడు. గోపమ్మ "ఓరే! మాధవా లేరా ఆముండ దొరికింది! గదిలో పెట్టి తాళంవేశాను" అంటూ తట్టిలేపింది.

శాస్త్రి కళ్లు నులుపుకొని గది నాలుగు వైపులా చూచేడు ఎదురుగా తల్లి కన పడింది "ఏమమ్మా ఇలా గొచ్చేవు అంటూ వాచీచూచేడు. రెండుగంటలైంది అమ్మా! స్టేషనుకి వెళ్లలేదు, పద్మని తీసు కొనిరాలేదు అత్త ఏమంటుందో. ఇంతకీ పద్మ వచ్చిందోలేదో వెధవనిద్ర తెలివే రాలేదు''అన్నాడు.

లోపలనుండి పెద్ద గొంతుకతో"అత్తా! తలుపుతీయత్తా నేను దయ్యాన్నికాను, పద్మను బావా! చూడు బావా అత్త ఎలాగు చేసిందో. తలుపుతియ్యి బావా రా అంటూ అరుస్తూంది పద్మ.

మాధవశాస్త్రి ''ఏమిటమ్మా ఆ కేకలు ఎవరున్నారు గదిలో '' అని అడిగేడు.

''అదేరా అదే ఆ చెట్టుమీాదఉన్న కామినీ దయ్యం. అదీ, ఆముల్లైచెంపు, ఎంత చక్కగా వచ్చిందనుకున్నావు ధైర్యం చేసి కొట్టులో పడేశాను కత్తిర పట్టుకొనిరా; సిగ కత్తిరిద్దాం'' అంది గోవమ్మ.

ఇంతలో గదిలోఉన్న సామానంతా చిందర వందర చేస్తూంది పద్మ కోపంతో. ఆఖరికి తలుపు తియ్యకపోతే ఏడుపు మొదలు పెట్టింది.

"చూశావా! ఎలా గల్లర పెడు తోందో, ఏడుస్తుంది వెధవ ఏడుపు! ఆ భేతాళరాజుని పిలవరా యీ ముండని భూస్థాపితం చేయిద్దాం'' అంది.

ఇంతలో రంగమ్మ లాంతరుతోవచ్చి వీధి తలుపు గుద్దుతోంది "వదినా, వదినా తలుపు, తలుపు'' అంటూ పిలుస్తోంది.

మాధవశాస్త్రి గబగబాపోయి తలుపు తీసేడు. రంగమ్మ లోనికివచ్చి "ఒరే! శాస్త్రి వచ్చిందిరా పద్మ! వెధవది నాది మొద్దునిద్దర. అందులో వెనకగదిలో పడక, పాపం పిలచేరు కాబోలు నాకు విన పడలేదు'' అంటూ చెబుతోంది.

గదిలోనుండి పద్మ ''అమ్మా! తలుపు తియ్యవే ఇదిగో యీ గదిలో అత్త నన్ను దయ్యం అని పడేసింది. బావా! తలుపు తియ్యవూ'' అంటూ ఏడుస్తూంది.

"ఏమిటి వదినా ఆ గదిలో ఏడుపు ఎవ రున్నారు ఏమిటి'' అంది రంగమ్మ.

''ఎవరా అదే మనచెట్టుమీాదఉన్న కామినీ భూతం'' అంది గోపమ్మ.

"లేవే కామినిభూతం ఏమిటి, కొంపతీసి పద్మ కాదుకదా అమ్మా! అని పిలు స్తోంది'' అంటూ గబగబావెళ్లి తలుపు తీసింది. ఒక్కమారుగా పద్మవచ్చి తల్లిని కౌగలించుకుంది.

"ఇదేమిటమ్మా ఇది. ఎవరు నిన్ను గదిలో పెట్టారు, బావస్టేషనుకిరాలేదు'' అని అడిగింది.

పద్మని చూడగానే మాధవశాస్త్రి తల దించేసుకొన్నాడు, గోపమ్మ నిర్ఘాంత పోయింది, పద్మ జరిగిన సంగతంతా తల్లితో చెప్పింది.

మాధవశాస్త్రి పద్మ చేయి పట్టుకొని క్షమించమన్నాడు. "తాను స్టేషనుకి రాక పోవడానికి అమ్మ కారణం" అన్నాడు. "దయ్యాలగోలతో మనస్సు కలత పెట్టే సింది, భయంలేనివాడికికూడా భయం తెచ్చి పెట్టింది. ఆఖరికి నిన్ను యీలాగు చేసింది క్షమించు" అన్నాడు.

"పోనీలే బావా! తెలియక జరిగిన విషయం దానికి మనం ఏంచేస్తాం, ఇప్పుడైనా వప్పుకున్నావా అత్తా నేను దయ్యాన్ని కానని, బావా! వస్తాను అత్తా జాగ్రత్తగా వుండుకో. దయ్యం అని బావను మూసేయగలవు" అంటూ వెళ్లింది.

"మూసేస్తానే భడవా! నిన్నూ, బావనికలిపి మూ సేస్తాను" అని నవ్వుతూ అంది గోపమ్మ.

కీ॥ శే॥ డా॥ కే. యన్. కేసరిగారి ప్రశంస

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

కేసరిగారు లోకబాంధవులు. మనకు మిగుల సన్నిహితులు. వారి జీవిత మహిమను వీక్షించు అవకాశములు మనకు లభించినవి. చాల కాలమునుండి వారి నెఱుగుదును. వారెన్నడైన పరుషవాక్కును ప్రయోగించుట నేనెఱుగను. పరమ ప్రశాంత భావముతో వారు ప్రసంగించువారు. వారి హృదయము కారుణ్యజలనిధి. జగతి ఎఱుగని గుప్తదానముల నెన్నిటినో వారు నిర్వహించిరి. మదరాసులోని తెలుగు వారి పురోభివృద్ధికై ముందంజవేసిన మహాపురుషుడాయన. కేసరి ఉన్నత పాఠశాల, కేసరి కన్యా విద్యాలయము, కేసరి కుటీరములు మహోన్నతములైనవి. నేడు మదరాసు మనకు లేకపోయినను పూర్వోక్త సంస్థలు కేసరిగారొనరించినవి; వారి జీవాత్మ ప్రసాదించు ఆశీస్సులనందుచు, క్రమాభివృద్ధినందునని ఆశపడుచున్నాను. వారి "గృహలక్ష్మి" ప్రతి గృహలక్ష్మి గృహమును ప్రతిజ్ఞానువు గృహమును అలంకరించుచునేయుండును. స్వర్ణకంకణ బహూకృతి జరుగుచునే యుండును. నేడాంధ్రభారతి విలపించుచున్నది. వారి పవిత్రాత్మకు అనంతానందము ఈశ్వరుడు ప్రసాదించుగాక.